ప్రాఙ్నన్నయయుగం-సాహిత్య వికాసం

ఉపోద్ఘాతం

తెలుగుభాషలో మౌఖిక, లిఖిత రూపంలో వచ్చిన మార్పులు గ్రంథస్థం చేశాక కొందరు దానిని తెలుగు సాహిత్యమని, మరికొందరు ఆంధ్ర సారస్వతమని, ఆంధ్ర వాఙ్మయమని ప్రస్తావించటం కనిపిస్తుంది. ఏది సాహిత్యం? ఏది సారస్వతం? ఏది వాఙ్మయం? అని చాలా మందిలో ఒక సంశయం కలుగుతుంది. సాహిత్యం, సారస్వతం, వాఙ్మయం అనే పదాలు సాధారణంగా సమానార్థకాలుగా వాడుతూ ఉంటాం. కానీ లోతుగా పరిశీలిస్తే అర్థంలో భిన్నంగా ఉంటాయి.

సాహిత్యం

"సహితస్య భావః సాహిత్యమ్", "హితేన సహితం సాహిత్యమ్" అని సాహిత్యం అనే పదానికి నిర్వచనాలున్నాయి. అంటే హితంతో కూడినది, హితాన్ని చేకూర్చేది సాహిత్యమని అర్థం.

సారస్వతం

సరస్వతీ సంబంధమైనది సారస్వతం. సరస్వతి అంటే చదువుల తల్లి. చదువు వలనే మన మాట, బుద్ధి వికసిస్తాయి. తద్వారా మనలో సంస్కారం అలవడుతుంది. అలాంటి సంస్కారం అందించేది సారస్వతంగా చెప్పవచ్చు.

వాఙ్మయం

వాక్ +మయం – వాఙ్మయం. 'వాక్' అనే శబ్దానికి 'మయట్' అనే ప్రత్యయం చేరిస్తే 'వాఙ్మయం' అనే పదం ఏర్పడుతుంది. మనం రాసే ప్రతి మాట, పలికే పలుకు అన్నీ 'వాఙ్మయం' లో చేరుతాయి.

సాహిత్యం కంటే సారస్వతం, సారస్వతం కంటే 'వాఙ్మయం' అనే పదం విశాలమైన అర్థంతో ఉంటుంది.

సాహిత్యం-అధ్యయన పద్ధతులు

సాహిత్యమనే పదం విస్తృతి చెంది, ఇప్పుడు ఎక్కువగా వాడుకలో ఉంది. సాహిత్యం లిఖిత, మౌఖిక రూపాలలో ఉంటుంది. అది ఏ రూపంలో ఉన్నా సాహిత్యానికి సమాజానికి అవినాభావ సంబంధం ఉంటుంది. సమాజం ఎప్పుడూ ఒకే రకంగా వుండనట్లే సాహిత్యం కూడా ఒకే రకంగా వుండదు. సమాజం మారేటప్పుడు సాహిత్యం మారుతుంది. సమాజ పరిణామంతో సాహిత్య పరిణామం ముడిపడి ఉంటుంది. సాహిత్య అధ్యయనం ద్వారా ఒక సమాజపు భాష, చరిత్ర, సంస్కృతులను అవగాహన చేసుకోవచ్చు. సాహిత్యాన్ని అధ్యయనం చేసేటప్పుడు శాస్త్రీయ మార్గాలను అనుసరించి చేయాలి. సాహిత్య

అధ్యయన పద్ధతులు 6 రకాలుగా ఉన్నాయి. ఇటీవల మరికొన్ని రకాలు చేరినా ముఖ్యమైనవి ఆరు. అవి 1. కాలానుసరణ అధ్యయన పద్ధతి 2. చారిత్రక అధ్యయన పద్ధతి 3. తులనాత్మక అధ్యయన పద్ధతి 4. లాక్షణిక అధ్యయన పద్ధతి 5. ప్రక్రియా పర అధ్యయన పద్ధతి 6. సామాజిక సాంస్కృతిక అధ్యయన పద్ధతి

1.కాలానుసరణ అధ్యయన పద్ధతి

కవి లేదా రచయిత జీవిత కాలాన్ని అనుసరించి అతని రచనలను అధ్యయనం చేసే పద్ధతిని కాలానుసరణ అధ్యయన పద్ధతి అంటారు.

2 చారిత్రక అధ్యయన పద్ధతి

కాలానుక్రమాన్ని అనుసరించి ఒక భాషలోవచ్చిన సాహిత్యాన్ని పూర్వాపర సంబంధ దృష్టితో పరిశీలించి అన్వయించే పద్ధతిని చారిత్రక అధ్యయన పద్ధతి అంటారు.

3 తులనాత్మక అధ్యయన పద్ధతి

సమాన కథా వస్తువుగల రచనల మధ్య, సమాన ధర్మాన్ని ప్రతిపాదించే రచయితల మధ్య, సమకాలీనులైన రచయితల మధ్య, తులనాత్మక పరిశీలనం ద్వారా రచనా స్వభావ తారతమ్య నిరూపణం చెయ్యడం తులనాత్మక అధ్యయన పద్ధతి. ఇతర దేశాల భాషలతో, రచయితల రచనలతో మన సాహిత్యాన్ని ఈ విధంగా అధ్యయనం చేయవచ్చు.

4 లాక్షణిక అధ్యయన పద్ధతి

ప్రాచీన కావ్య నాటకాలను అలంకార శాస్త్రగ్రంథంతో అధ్యయనం చెయ్యడం లాక్షణిక అధ్యయన పద్ధతి.

5 ప్రక్రియా పర అధ్యయన పద్ధతి

ప్రాచీన ఆధునిక కాలాల్లో వ్యాప్తి చెందిన భిన్న సాహిత్య శాఖల్ని ప్రక్రియారూపంగా విభజించి చదివే పద్ధతి

6 సామాజిక సాంస్కృతిక అధ్యయన పద్ధతి

ఒక కాలంలో వెలుగు చూసిన ఒకజాతి సాహిత్యాన్ని చదవడం ద్వారా ఆ జాతి సామాజిక పరిస్థితుల్ని, సాంస్కృతిక అభివృద్ధిని అర్థం చేసుకోవడానికి ఉపకరించేదే సామాజిక సాంస్కృతిక అధ్యయన పద్ధతి. ఈ విధంగా సాహిత్యాన్ని శాస్త్రీయంగా పరిశోధించి అధ్యయనం చేయవచ్చు. సాహిత్య చరిత్రను శాస్త్రీయంగా అధ్యయనం చేయడానికి మనకు ఆధారాలు అవసరమవుతాయి.

సాహిత్య చరిత్ర – ఆధారాలు

తెలుగు సాహిత్యచరిత్ర నిర్మాణానికి శాసనాలు, కావ్యావతారికలు, ఆశ్వాసాంత గద్యలు, లక్షణ గ్రంథాలు, సంకలన గ్రంథాలు, గ్రంథసూచికలు, చారిత్రక ఆధారాలు, మౌఖిక సాహిత్యం మొదలైనవి మనకు లభిస్తున్నకొన్నిముఖ్యమైన ఆధారాలు. వీటి ఆధారంగా తెలుగు సాహిత్య చరిత్రను రాసే ప్రయత్నం జరిగింది.

సాహిత్య చరిత్ర – యుగ విభజన

యుగం అంటే ఒక కాలపరిమితిగా చెప్పవచ్చు. సమాన ధర్మాలు, కొంత విశిష్టత కలిగిన కాలాన్ని యుగం అంటారు. భాషా సాహిత్య చరిత్రను అధ్యయనం చేసి పరిశీలించడానికి 'యుగ విభజన' ఒక కొండగుర్తుగా ఉపయోగపడుతుంది.

చరిత్ర, రాజవంశాలు, సామాజిక, ఆర్థిక పరిస్థితులు, కవులు ఇలా ఒక్కొక్క అంశం ఆధారంగా ఒక్కొక్క సాహిత్య కారుడు ఒక్కో పద్ధతిని అవలంబించి సాహిత్య చరిత్రను విభజన చేయడం మనం గమనించవచ్చు. ఐతే ఇవే ప్రామాణికం అని చెప్పడానికి వీలు లేదు. కేవలం సౌలభ్యం కోసం మాత్రమే యుగవిభజన అని మనం అవగాహన చేసుకోవాలి.

కందుకూరి వీరేశలింగం 'ఆంధ్ర కవుల చరిత్ర', గురజాడ శ్రీరామమూర్తి 'కవిజీవితములు', దివాకర్ల వెంకటావధాని 'ఆంధ్ర వాఙ్మయచరిత్రం', కోరాడ రామకృష్ణయ్య 'ఆంధ్రవాఙ్మయ చరిత్రం - యుగ విభజనం', ఖండవల్లి లక్ష్మీరంజనం 'ఆంధ్రవాఙ్మయ చరిత్ర సంగ్రహం', వంగూరి సుబ్బారావు 'ఆంధ్ర వాఙ్మయచరిత్ర', ఆరుద్ర 'సమగ్రాంధ్ర సాహిత్యం' శిష్టా రామకృష్ణశాస్త్రి 'ఆంధ్ర వాఙ్మయచరిత్ర సర్వస్వం' వి.నారాయణరావు 'కవిత్వవేది' వంటి గ్రంథాలలో తెలుగు సాహిత్య యుగ విభజన చేశారు. వేటూరి ప్రభాకరశాస్త్రి, చిలుకూరి వీరభద్రరావు, చాగంటి శేషయ్య, మల్లంపల్లి సోమశేఖర శర్మ, సురవరం ప్రతాపరెడ్డి వంటి పరిశోధకులు విలువైన వ్యాసాలను వెలువరించారు.

ఆచార్య పింగళి లక్ష్మీకాంతం గారి ప్రకారం-

1. ప్రాఙ్నన్నయ యుగం - క్రీ.పూ. 200 నుంచి క్రీ.శ.1000 వరకు

2. నన్నయ యుగం - 11వ శతాబ్ది

3. శివకవి యుగం - 12వ శతాబ్ది

4. తిక్కన యుగం - 13వ శతాబ్ది

5. ఎఱ్ఱన యుగం - 1300 - 1350 వరకు

6. శ్రీనాథ యుగం - 1350 నుంచి 1500 వరకు

7. రాయల యుగం లేదా ప్రబంధ యుగం - 1500 నుంచి 1600 వరకు

8. దక్షిణాంధ్ర యుగం - 1600 నుంచి 1775 వరకు

9. క్షీణ యుగం - 1775 నుంచి 1875 వరకు

10. ఆధునిక యుగం - 1875 నుంచి

అని పది యుగాలుగా తెలుగు సాహిత్యాన్ని విభజించారు. ఎక్కువమందికి ఇది

ఆమోదయోగ్యమై, దీనినే పాటిస్తున్నారు.

ప్రాఙ్నన్నయ యుగం

ప్రాక్ అంటే పూర్వకాలం. నన్నయకు పూర్వం ఆంధ్రభాషా సాహిత్యాల స్వరూపాన్ని, పరిణామాన్ని పరిశీలించడానికి ప్రత్యేకంగా తెలుగు సాహిత్య చరిత్ర ప్రాఙ్నన్నయ యుగంతో ప్రారంభమయింది. క్రీ.పూ.200 నుండి క్రీ.శ.1000 వరకు ఉన్న కాలాన్ని నన్నయకు పూర్వకాలం లేదా ప్రాఙ్నన్నయ యుగం అంటారు. తెలుగులో నన్నయను ఆదికవిగా గుర్తించారు. సంస్కృత మహాభారతాన్ని ఆయన ఆంధ్రీకరించారు. అంతటి కావ్యేతిహాసానికి అవసరమైన భాష ఒక్కసారిగా పుట్టుకు రాదు. కనుక నన్నయకు ముందు తెలుగు భాష ఉంది అని చెప్పడానికి లభిస్తున్నఆధారాలు శాసనాలు మాత్రమే. వీటిని పరిశీలించినపుడు తెలుగు భాష స్వరూపం అర్థమవుతుంది.

ప్రాఙ్నన్నయ యుగం – సాహిత్య వికాసం

ప్రారంభంలో తెలుగు భాషను 'ఆంధ్రం' అనే పేరుతో వ్యవహరించారు. తర్వాత 'తెనుగు', 'తెలుగు' అనే పదాలు తెలుగుభాషకు పర్యాయపదాలు అయ్యాయి. ఈ మూడుపదాలు భాషాపరంగా, దేశపరంగా, జాతిపరంగా ప్రయోగించబడినట్లు ఆధారాలున్నాయి. శాతవాహనుల కాలం నాటి అమరావతి స్థూపం పై ఉన్న 'నాగబు' అనే పదం శాసనాల్లో తొలి తెలుగుపదం అని మొట్టమొదటిసారిగా ప్రముఖ విమర్శకులు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు గుర్తించారు. ఐతే ఇటీవల విశాఖపట్టణం జిల్లా ఎలమంచిలి దగ్గర కొత్తూరులో లభించిన క్రీ.పూ.200 నాటి ప్రాకృత శాసనంలో 'తమ్సాయదానం' అనే మాట కనిపించింది. ఇది 'తంబయదానం' అనే తెలుగు మాటగా గుర్తించారు. ఇటీవల శ్రీలంక, ఇండోనేషియా, థాయిలాండ్, బర్మా, ఇతియోఫియా వంటి దేశాలలో, తెలుగు రాష్ట్రాలలోని వివిధ ప్రదేశాలలో బయల్పడుతున్న శాసనాలు అందుబాటులోనికి వస్తే నన్నయకు ముందు భాషా సాహిత్యాల గురించి మరికొంత తెలుసుకునే అవకాశం లభిస్తుంది.

ప్రాకృత భాషలో హాలుని గాథాసప్తశతిలో అత్త, పాడి, అమ్మ, అయ్య, అయ్యో, పొట్ట, పిల్ల, కండె, అద్ధం, పంది వంటి తెలుగు పదాలున్నాయి. కొన్ని సంస్కృత, ప్రాకృత శాసనాల్లో వేవూరు, కూదూర

వంటి గ్రామాల పేర్లు కనిపిస్తాయి. భారతంలో 'నాగీ గీతాలు'పేర్కొనడాన్నిబట్టి నన్నయకు ముందు మౌఖిక రూపంలో జానపద గేయాలు ఉన్నట్టు తెలుస్తుంది. పద, గేయ రూపమైన దేశికవిత్వం ఉన్నట్టు ఆధారాలు కనిపిస్తాయి. కనుక నన్నయకు ముందు తెలుగు భాష, సాహిత్యం ఉన్నట్లు అర్థమవుతుంది.

శాసన కవిత్వం

తెలుగులో మొట్టమొదటి శాసనంగా విమర్శకులు పరిగణిస్తున్నది ధనుంజయుని కలమళ్ళ శాసనం. క్రీ.శ॥ 575 లో కడపజిల్లా కమలాపురం తాలూకా ఎర్రగుడిపాడులోని చెన్నకేశవస్వామి ఆలయంలో 'ఎరికల్ ముత్తు రాజు' వేయించిన శాసనంలో వచనం కనిపిస్తుంది. మొట్టమొదటి తెలుగు పద్యశాసనం క్రీ.శ. 848 ప్రాంతంనాటి పండరంగని అద్దంకి శాసనం. ఇందులో తరువోజ ఛందస్సు, వచనం కనిపిస్తున్నాయి. క్రీ. శ. 885 నాటి యుద్ధమల్లుని బెజవాడ శాసనంలో 5 మధ్యాక్కరలు, క్రీ.శ. 1000 నాటి విరియాల కామసాని గూడూరు శాసనం లో మూడు చంపకమాలలు, రెండు ఉత్పలమాలలు వున్నాయి.

భాషా స్వరూపం-ముఖ్యాంశాలు

- ప్రాఙ్నన్నయ యుగంలో అచ్చులు 10 + హల్లులు 23 మొత్తం 33 వర్ణాలు కనిపిస్తున్నాయి.
- సాధు రేఫం(ర) కన్నా శకట రేఫం(ఱ) ఎక్కువ వాడుకలో ఉంది.
- తమిళ ఉచ్చారణలో ఉండే (ZHA) అనే వర్ణం (ழ (ZHA)) ఎక్కువగా కనిపిస్తుంది. ఇది తర్వాత ఱ - డ - ళ గా మారింది.
- రేఫ (రకారం)కు బదులుగా వలపల గిలక(్ర) కనిపిస్తుంది.
- సున్నకు బదులుగా వర్గ పంచమాక్షరాలైన అనునాసికాలను వాడేవారు ఉదా: కట్టిఞ్చె (కట్టించె),ము కారం బదులు బు,ంబు,వు వాడుకలో ఉన్నాయి.
- ఒక విభక్తికి మరొక విభక్తి వాడడం కనిపిస్తుంది.ఉదా. నేలయిచ్చిరి (నేలను ఇచ్చారు)
- హ్రస్వాలు ఉండవలసిన చోట దీర్ఘాలు కనిపిస్తాయి.ఉదా: మహారాజులాకు.
- సంఖ్యావాచకాలు ఒరు,రెన్టు,మొదలైన రూపాలలో కనిపిస్తాయి.
- ఏకవచనంలోబు,ంబు,వు అనేవి,బహువచనంలోళ్ఎక్కువగా,ర్,రు లు తక్కువగా కన్పిస్తాయి.
- శ,ష లకు బదులు స వాడకం ఎక్కువ.
- ఋ స్థానంలో రి వాడకం వుంది.
- ఈనాడు 'బహుళం'గా ఉన్న గసడదవాదేశ సంధి ఆనాడు 'నిత్యం'గా కనిపిస్తుంది.
- వాక్య రచన సరళంగా ఉండటం గమనించవచ్చు.

శ్రీపతి పండితుడు(క్రీ.శ.898), అయ్యనభట్టు (క్రీ.శ.973-990), చేతనభట్టు(క్రీ.శ.1022), నన్నయకు ముందున్న శాసనకవులు. వీరి కావ్యాలేవీ లభించటం లేదు. పద్మకవి, సర్వదేవుడు తెలుగులో జైన కావ్యాలు రచించినట్లు చెబుతున్నా వారి కావ్యాలేవీ లభించటం లేదు. కనుక నన్నయకు ముందు శాసన

కవిత్వంలో కొన్ని తెలుగు పదాలు, కొంత మౌఖిక సాహిత్యం ఉంది తప్ప ప్రాఙ్నన్నయ యుగంలో కావ్య రూపంలో ఏదీ లభ్యం కావటంలేదు.

ఉపయుక్త గ్రంథ సూచి

1.ఆంధ్ర సాహిత్య చరిత్ర – పింగళిలక్ష్మీకాంతం

2.తెలుగు సాహిత్య సమీక్ష - డా.జి.నాగయ్య(మొదటి సంపుటం)

3.సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర

4.తెలుగు సాహిత్య చరిత్ర - డా. ద్వా.నా.శాస్త్రి

5. తెలుగు సాహిత్య చరిత్ర – ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న

అంతర్జాల లింకులు

1.తెలుగు సాహిత్యం

https://te.wikipedia.org/wiki/%E0%B0%A4%E0%B1%86%E0%B0%B2%E0%B1%81%E0%B0%97%E0%B1%81_%E0%B0%B8%E0%B0%BE%E0%B0%B9%E0%B0%BF%E0%B0%A4%E0%B1%8D%E0%B0%AF%E0%B0%AE%E0%B1%81

2. తెలుగులో శాసనాలు

https://te.wikipedia.org/wiki/%E0%B0%A4%E0%B1%86%E0%B0%B2%E0%B1%81%E0%B0%97%E0%B1%81_%E0%B0%B6%E0%B0%BE%E0%B0%B8%E0%B0%A8%E0%B0%BE%E0%B0%B2%E0%B1%81

3.archive.org/details/TeluguSasanalu